క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న ఆశ్రం వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఫ్రెండ్ ఆఫ్ గాడ్ చర్చి ఆధ్వర్యంలో ఆశ్రం ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక శ్రీరామ్ నగర్ 1వ రోడ్‌లోని యేసయ్య దీవెన నిలయంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వందలాది మంది స్థానికులకు జనరల్, స్త్రీ, పిల్లలు, చెవి, ముక్కు, గొంతు, ఎముక వ్యాధులు, నేత్ర సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాన్ని ఫ్రెండ్ ఆఫ్ గాడ్ యూత్ ప్రతినిధి ఎస్ఎల్ పాల్ పర్యవేక్షించారు.

ఇన్‌చార్జి ఏఓగా రాజశేఖర్



రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఎక్స్‌పెండిచర్ విభాగంలో ఇన్‌చార్జి అక్కౌంట్స్ అధికారిగా టి.రాజశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో అసిస్టెంట్ అక్కౌంట్స్ అధికారిగా పని చేస్తూ రాజశేఖర్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రాజశేఖర్‌ను సర్కిల్ పరిధిలోని పలువురు సిబ్బంది, స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు పదోన్నతిపై విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

23న అమ్మవారి చీరల వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాదలోని నాలుగు గుడుల సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికల వేలం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో బహిరంగ వేలం ప్రారంభమౌతుందని, ఆసక్తిగల వారంతా ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని
- శనివారపుపేట ఇందిరా కాలనీలో శంకుస్థాపన



ఇందిరా కాలనీలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, ఇడా చైర్మన్ బొద్దాని



పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ శారద

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ.. ప్రతి ప్రాంతంలోనూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. శనివారపుపేట ఇందిరాకాలనీలో రూ.25 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు, కల్వర్టులు, బోర్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే ఏలూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి సీసీ డ్రెయినేజీలు, రోడ్లు నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ ఏడు గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, సుమారు 70 వేల మంది ప్రజలకు తాగునీరు ఇంటింటికీ సరఫరా చేసేందుకు రూ.160 కోట్లు నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. ఇప్పటికే డీపీఆర్ పూర్తి చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వచ్చే వేసవి నాటికి ఏడు గ్రామాల్లో గోదావరి జలాలను ఇంటింటికీ సరఫరా చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్ గునుపూడి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని కృషితో వేలాది మందికి ఇళ్ల పట్టాలు అందజేస్తున్నట్టు ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు 35వ డివిజన్ 12 పంపుల సెంటర్ 25వ సచివాలయంలో లబ్ధిదారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని ఇళ్ల పట్టాలు మంజూరయిన లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల పేరుతో ఇళ్లు ఇవ్వాలని సంకల్పంతో రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించారని, ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాని 31 వేల మందికి ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తున్నారని శ్రీనివాస్ చెప్పారు. చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో మోసం చేస్తే.. నేడు సీఎం జగనన్న ఇళ్లు కట్టించి ఇస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, పార్టీ క్లస్టర్–2 మహిళా అధ్యక్షురాలు గుడిదేశి లక్ష్మీశారద, 25, 18, 16 సచివాలయాల సెక్రటరీలు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఉన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం



సీతారామ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గాదంశెట్టి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కైకలరుకు చెందిన భగవద్గీత ప్రవచకులు, హిందూ ధర్మ ప్రచారకులు ఘంటసాల బసవయ్య నరసింహావతారం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి నగరానికి చెందిన టీవీ హరికథా కళాకారిణి సప్పా బారతి భాగవతారిణి సుందరకాండ అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు

పెదపాడు: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫీఎం శ్రీపథకంలో మంజూరైన రూ.15లక్షల నిధులతో కెమిస్ట్రీ ల్యాబ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పెదపాడు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందజేశారు. తొలుత సమగ్రశిక్ష ద్వారా సరఫరా చేసిన 5 కంప్యూటర్లు, ప్రింటర్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపీపీ బత్తుల రత్నకుమారి, నాయకులు బత్తుల ఏసురాజు, ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు పీఎంసీ చైర్మన్ హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్



ఎమ్మెల్యేలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి, సుబ్బరాజు, సునీల్ కుమార్‌లకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు



ఒకే మోటారు సైకిల్‌పై ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి



వెంకయ్య వయ్యేరు కాలువ బ్రిడ్జిపై నాయకుల బైక్ ర్యాలీ

ఉంగుటూరు/గణపవరం: నియోజకవర్గంలోని నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సుమారు 40 కిలో మీటర్ల మేర నిర్వహించిన భారీ ర్యాలీ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. మెయ్యేరు, పిప్పర, అర్ధవరం గణపవరం, నిడమర్రు, రాచూరు, నారాయణపురం, చేబ్రోలు మీదుగా గొల్లగూడెం, రామచంద్రపురం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కోటగిరి శ్రీధర్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు తదితరులపై ఆయా ప్రాంతాల్లో ప్రజలు పువ్వులు చల్లి స్వాగతం పలికారు. మళ్లీ గెలుపు తమదేనంటూ ఆనందం వ్యక్తం చేశారు. రామచంద్రపురంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 33 వేలు మెజారిటీ రాగా, రానున్న ఎన్నికల్లో 1 లక్ష మెజారిటీ రావడం ఖాయమన్నారు. ఎంపీగా సునీల్ కుమార్‌ను, ఎమ్మెల్యేగా తనను, అబ్బయ్యచౌదరిని గెలిపించాలని కోరారు. కారుమూరి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడారు. సభ వద్ద ఎమ్మెల్యేలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి, సునీల్ కుమార్‌లకు అభిమానులు క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు. పార్టీ నాలుగు మండలాల నాయకులు దండు రాము, మరడ మంగరావు, మంద జయలక్ష్మి, కరణం బుజ్జి, గౌతు రాము, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, బళ్ల త్రిమూర్తులు, పైడిముక్కల రామకృష్ణ, పెనుగొండ బాలకృష్ణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి తదితరుల నేతృత్వంలో ర్యాలీలు నిర్వహించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	15

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	--

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	34–48	కీరా దోస	36
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	80
కాలీఫ్లవర్	30	అల్లం	140
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36–40	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24–28	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

కేర్ హోమ్ ఫెసిలిటీ ఉద్యోగ అవకాశాలు

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నావిస్ హెచ్‌ఆర్ వారిచే ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపాన్ కేర్ వర్కర్స్ ఇన్ హాస్పటల్స్ లో కేర్ హోమ్ ఫెసిలిటీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జపనీస్ భాషలో పూర్తి రెసిడెన్షియల్ తరగతి విధానంలో బెంగళూరు కేంద్రంగా ఆరు నెలల శిక్షణ ఉంటుందని, ఉచిత వసతి, ఆహారం కల్పిస్తారని, 18 నుంచి 32 సంవత్సరాల గల యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50,000 చెల్లించాల్సి ఉండగా, అభ్యర్థి రూ.25 వేలు చెల్లిస్తే, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.25 వేలు, ట్రైనింగ్ ఫీజు రూ.3 లక్షలు చెల్లించాలని ఆయన తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి నెలకు రూ.1,10,000 నుంచి రూ.1,40,000 జీతం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు కిషోర్ సెల్ నెంబర్ 90302 27668లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమిల్లి శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17న ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వార్షిక సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

తత్వవేత్త కారల్ మార్క్స్

ఏలూరు (టూటౌన్): కారల్ మార్క్స్ వర్ధంతి కార్యక్రమం ఏలూరులో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమాజానికి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అందించిన తత్వవేత్త కారల్ మార్క్స్ అని పార్టీ నేతలు తెలిపారు. మార్క్స్‌కు నివాళులర్పించినవారిలో సీపీఎం జిల్లా నేత కె.శ్రీనివాస్, నగర కార్యదర్శి పి.కిషోర్ తదితరులు ఉన్నారు. సీపీఐ ఆధ్వర్యంలోనూ స్ఫూర్తి భవన్‌లో మార్క్స్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు హేమ శంకర్, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



కాళిదాసు కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత కృష్ణవేణి, మహిళలు

దెందులూరు: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ మహిళా నేత కృష్ణవేణి డిమాండ్ చేశారు. గురువారం దెందులూరు కాళిదాసు కాలనీలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రతిపక్ష టీడీపీ, జనసేన మద్దతుదారులు వేధింపులు, ట్రోల్స్‌ను తట్టుకోలేక గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని, ఇది బాధాకరమైన విషయమని అన్నారు. గీతాంజలి మరణానికి కారణమైన వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడడం వల్ల భర్త, పిల్లలు అన్యాయమైపోతారని అన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలకు స్వస్తి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

ఇంటి నుంచే ఓటేయవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ ఖాజావల్లి

ఉంగుటూరు: అంగవైకల్యం ఉన్నవారు, వృద్ధులు ఇంటివద్ద నుంచే ఓటేసే సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఖాజావల్లి అన్నారు. గురువారం ఉంగుటూరులో ఏర్పాటుచేసిన నోడల్ అధికార్ల సమావేశంలో ఖాజావల్లి మాట్లాడారు. వృద్ధులు ప్రత్యేక కమిటీ ద్వారా పోస్టల్ బ్యాలెట్ వేయించాల్సి ఉంటుందన్నారు. నోడల్ అధికార్ల విధులను వివరించారు. తహసీలార్ వెంకటశివయ్య, ఏకేఎస్‌సీఐ గిరిజ, డీఎస్పీ విద్య మాట్లాడారు. వంద మంది నోడల్ అధికార్లు పాల్గొన్నారు. గణపవరం మండలం ఉపాధ్యాయులకు నారాయణపురం హైస్కూలులో శిక్షణ ఇచ్చారు.

కేంద్ర బలగాలతో కవాతు



దెందులూరులో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, స్వేచ్ఛాయుతంగా ఓటు వేయాలని కోరుతూ సాయుధ బలగాల కవాతును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు. ఈ ర్యాలీ పెదవేగి సీఐ కే. శ్రీనివాస్, దెందులూరు ఎస్ఐ కే. స్వామి కవాతులో పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తుల పరిశీలన

దెందులూరు: మండలంలో 341 విశ్వకర్మ యోజన పథకంలో దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ పీ.శ్రీలత తెలిపారు. గురువారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో విశ్వకర్మ యోజన పథకంలో దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.